సాక్షి
ప్రకాశం

సోమవారం । 29 । మే । 2023



ట్రాలీ ఆటో బోల్తా
పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాలీ ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా ఆరుగురికి గాయాలయ్యాయి.
- 8లో..



హలో..జాగ్రత్త
మోసపూరిత టోల్‌ఫ్రీ నంబర్లతో కస్టమర్ సపోర్ట్ స్కాంలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
42 /28

వాతావరణం
ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికం.

న్యూస్‌రీల్

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంలో ఎంపీ మాగుంట



పార్లమెంట్‌లో సహచర ఎంపీలతో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు: నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఢిల్లీలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సహచర ఎంపీలతో కలిసి ఆయన పార్లమెంట్‌లో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్లు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె తాండా గ్రామంలో పట్టాభిరామస్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో నంద్యాల జిల్లా ఎడ్లు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎడ్ల పోటీలను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించారు. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బి.కేశవరెడ్డి ఎడ్లు 4250 అడుగులు దూరం బండను లాగి మొదటి బహుమతి కింద రూ.50 వేలను, ప్రకాశంజిల్లా కాటంరెడ్డి పెద్దిరెడ్డి ఎడ్లు 4000 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30 వేలను, బురుజుపల్లె గ్రామానికి చెందిన ఎరమల సోహిత్‌రెడ్డి ఎడ్లు 3170 అడుగులు లాగి మూడో బహుమతి కింద రూ.20 వేలను, నరసరావుపేటకు చెందిన యరసాని సుబ్బయ్య ఎడ్లు 3122 బండను లాగి నాల్గవ బహుమతి రూ.10 వేలను, బురుజుపల్లె గ్రామానికి చెందిన బాలకాటి ఎడ్లు 2000 అడుగులు లాగి 5 వ బహుమతి రూ.5 వేలను దక్కించుకున్నాయి. ఈ ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రంగారెడ్డి, రామక్రిష్ణ, దాసరి సంగీతరావు, పాల్గొన్నారు.

జూన్ 2 నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

చీమకుర్తి: పదో తరగతి విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ నెల 2వ తేదీ నుంచి 10 వరకు జరగనున్నాయని అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...జిల్లా వ్యాప్తంగా సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు 8 వేల మంది వరకు ఉన్నారు. వారు పరీక్షలు రాసేందుకు జిల్లా మొత్తం 44 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూన్ నెల 2వ తేదీ నుంచి 10 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 వరకు పరీక్షలు జరగనున్నాయి. గత ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగిన రెగ్యులర్ పదో తరగతి పరీక్షల్లో 28,900 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 8 వేల మంది ఫెయిల్ అయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సూచనలు, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఫెయిలైన విద్యార్థులకు వారు చదివిన పాఠశాలల్లోనే ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి దాదాపు 20 రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులను నూరు శాతం ఉత్తీర్ణులను చేసేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దానిలో భాగంగా హాస్టల్ విద్యార్థులకు శింగరాయకొండ, చీమకుర్తి, కంభం గురుకుల పాఠశాలల్లో కూడా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పంట సాగు చేసిన దగ్గర నుంచి దిగుబడులు గిట్టుబాటు ధరలకు అమ్ముకునే వరకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. చిన్న, సన్నకారులు రైతులు వ్యవసాయ సీజన్ ఆరంభంలో అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి బయటపడేసేందుకు ఏటా రూ.13,500 నగదు విడతల వారీగా అందజేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగో ఏడాదీ రైతు భరోసా పంపిణీకి చర్యలు చేపట్టింది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితాలను ఆర్బీకేల్లో ఉంచారు. ఈనెల 30న రైతు ఖాతాల్లో నగదు జమచేయనున్నారు.

సాగుకు భరోసా..
రైతన్న కులాసా



పొలాన్ని దున్నుతున్న రైతు

- జిల్లాలో 2,84,113 కుటుంబాలకు రూ 213.08 కోట్లు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం
- వైఎస్సార్ ఆర్‌బీ కింద రూ.156.75 కోట్లు
- పీఎం కిసాన్ కింద రూ.56.37 కోట్లు
- నాలుగో ఏడాది రైతు భరోసా పంపిణీకి చర్యలు
- ఆర్బీకేల్లో అర్హుల జాబితాలు
- ఈనెల 30న రైతు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం

కనిగిరి రూరల్/మార్కాపురం: ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో రైతులకు ఉపయోగపడేలా రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయి. గతంలో రైతులు పొలాలు సాగు చేసుకునేందుకు సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారుల వద్దకు, దుకాణదారుల వద్దకు వెళ్లి అధిక వడ్డీకి, అరువుకు తెచ్చుకునే దుస్థితి. ప్రస్తుతం ఆ పరిస్థితికి చెక్ పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతన్నలకు అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.13,500 నగదు అందజేసి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. అందులో భాగంగానే నాలుగో విడత రైతు భరోసా నగదును రైతుల అకౌంట్లలో వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు అర్హుల జాబితాలను సైతం ఆర్బీకేల్లో వ్యవసాయ అధికారులు ప్రదర్శించారు. ఈనెల 30న రైతుల ఖాతాల్లో భరోసా నగదు జమ చేయనున్నారు.

వైఎస్సార్ రైతు భరోసా పొందడం ఇలా..
రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు, పాసు పుస్తకాలు తీసుకుని స్థానిక ఆర్బీకేలో అందజేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఇందులో కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున వేయగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.7,500 జమ చేస్తోంది. దీంతో ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.13,500 నగదు అందుతుంది.

అర్హులు ఎవరంటే...
➤ పొలం ఉన్న ప్రతి రైతు వెబ్‌ల్యాండ్‌లో నమోదై ఉంటే అర్హులే.
➤ కుటుంబంలో ఒకరికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుంది.
➤ చనిపోయిన రైతుల స్థానంలో వారి నామినీ, కొత్తగా తమ పొలాలను కొనుక్కొని ఇప్పటి వరకు రైతు భరోసా పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
➤ డీకే పట్టా సాగుచేసుకుంటున్న రైతులంతా వెబ్ ల్యాండ్‌లో పేరు నమోదై ఉంటే అర్హులే.
➤ కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు అర్హత కార్డు కలిగి ఉండి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అర్హులు.
➤ ప్రధాన మంత్రి కిసాన్ నిధి యోజన కింద ప్రయోజనం పొందే వారంతా ఈ పథకానికి అర్హులే.

నియోజకవర్గాల వారీగా రైతులకు 2023-24 ఏడాదికి సంబంధించి మొదటి విడతగా ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం నగదు ఇలా..

నియోజకవర్గం	రైతు కుటుంబాలు	పీఎం కిసాన్ నగదు రూ.కోట్లలో	రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే భరోసా నగదు రూ.కోట్లలో	మొత్తం నగదు రూ.కోట్లలో
దర్శి	43,369	8.65	23.88	32.53
గిద్దలూరు	41,815	8.36	23.00	31.36
కనిగిరి	44,263	8.85	24.34	33.20
కొండేపి	39,533	7.91	21.74	29.65
మార్కాపురం	33,716	6.74	18.54	25.29
ఒంగోలు	10,355	2.07	5.70	7.77
ఎస్ఎన్‌పాడు	29,972	5.99	16.48	22.48
వై.పాలెం	41,090	7.79	23.02	30.81
మొత్తం	2,84,113	56.37	156.715	213.085

గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో రైతు భరోసా కింద లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతులు	నగదు (కోట్లల్లో)
2019- 20	2,30,453	311.11
2020–21	2,61,660	353.24
2021–22	2,74,790	370.97
2022–23	2,86,256	386.45

మొత్తం మీద రూ.1421.77 కోట్లను అందించారు.



రైతు భరోసా కేంద్రాల్లో అర్హుల జాబితా ప్రదర్శనలో వ్యవసాయ అధికారులు

అర్హులందరికీ వర్తింపచేస్తాం



అర్హత కలిగిన ప్రతి రైతుకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తిస్తోంది. ఇప్పటికే ఆర్బీకేల్లో రైతుల జాబితాను ప్రదర్శించాం. గతంలో అర్హత ఉండి అందుకోలేని వారికి, ఈ ఏడాది కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి వర్తించేలా చర్యలు చేపట్టాం.
– ఇ.వెంకట రమణ, ఏడీఏ, కనిగిరి

ఈనెల 30న రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ



వైఎస్సార్ రైతు భరోసా పథకం నాలుగో ఏడాది నగదును ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండలో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన 2,84,113 మంది రైతు కుటుంబాలకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు కలిపి రూ.213.085 కోట్లు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. అవిగాక త్వరలో కౌలు రైతులకు 5,148 మందికి సుమారు రూ.3 కోట్లు రైతుల ఖాతాల్లో జమవుతాయి. అలాగే జిల్లాలో ఇటీవల పంట నష్టపోయిన 341 మంది రైతులకు రూ.34 లక్షల నగదును రైతుల ఖాతాల్లో వేయనున్నారు.
– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి, ఒంగోలు

ప్రతి ఏడాది రైతు భరోసా అందుతుంది



2019 నుంచి ఏటా నాకు రైతు భరోసా అందుతోంది. ఏడాదికి రూ.13,500 వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులకు ఈ మొత్తం నగదు ఎంతో ఉపయోగం. ఈ ఏడాది కూడా జాబితాలో నాపేరు ఉంది. రైతు భరోసా వల్ల అప్పులు చేసే అవసరం లేకుండా పోయింది. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు కూడా అందుబాటులో ఉంటున్నాయి.
– సంగు వెంకటేశ్వరరెడ్డి, చిన ఇర్లపాడు

గతంలో ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. మూడేళ్ల నుంచి ఏటా రైతు భరోసా డబ్బు అకౌంట్లలో నేరుగా జమవుతున్నాయి. ప్రభుత్వం అందించే వైఎస్సార్ రైతు భరోసా ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ముందస్తు సాయం ఎంతో ఉపయోగం. గతంలో సాగు ఖర్చులకు ఇబ్బందిపడే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెట్టుబడి సాయంగా అందజేసే రూ.7,500 నగదు సాగు ఖర్చులకు అండగా ఉంటోంది. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా ఎన్నో పథకాలు అమలు చేస్తూ అండగా ఉంటోంది.
– అట్లా రామచంద్రారెడ్డి, చీర్లదిన్నె

గిరిజన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అటవీ హక్కుల చట్టాలని అమలు పరిచింది వైఎస్సార్
- ఆర్వోఎఫ్‌ఆర్ భూములకు రైతు భరోసా వర్తింపచేసిన జగనన్న
- చెంచు గూడెంలో ఉన్న సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: గిరిజన సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని గంజివారిపల్లె పంచాయతీకి సమీపంలోని అటవీ ప్రాంతమైన అల్లిపాలెం చెంచుగూడెంలో ఆదివారం సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్వోఎఫ్‌ఆర్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచి, గిరిజనులు సేద్యం చేసుకుంటున్న భూములకు చట్టబద్ధత కల్పించారని అన్నారు. ఆర్వోఎఫ్‌ఆర్ భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకునే అవకాశం కల్పించడంతోపాటు రైతు భరోసా వర్తించేలా చర్యలు తీసుకొని, వారి అకౌంట్‌లలో డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. భర్త మృతి చెందితే ఆ పట్టాను భార్యపేరుతో మార్చేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, ఇంటి స్థలానికి పట్టాలు ఇవ్వడమే కాకుండా 30 అడుగు రోడ్లతో గృహాలు తామే నిర్మించి ఇస్తామని హర్షధ్వానాల మధ్య మంత్రి ప్రకటించారు. సేద్యం చేసుకోవటానికి భూములు ఉన్నాయని, నీటి సదుపాయం కోసం బోర్లు వేసుకున్నా అద్దె మోటార్లతో నీటిని తోడుకునే పరిస్థితి ఏర్పడిందని తన దృష్టికి వచ్చిందన్నారు. నీటి వసతి లేని పొలాల్లో బోర్లు వేయించి, మోటార్లు బిగించి తక్షణమే విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. నెలరోజుల లోపు సంబంధిత అధికారులు ఈ పనులు పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్ మాట్లాడుతూ అల్లిపాలెం చెంచుగూడెం అటవీ ప్రాంతంలో ఉండటమేకాకుండా పూర్తిగా వెనకబడిన ప్రాంతంగా గుర్తించారని, ఈ ప్రాంతానికి అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది కూడా రాకపోవడం వలన గూడెంలో ఉన్న సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. ఈ సమస్యలతోపాటు ఫారెస్ట్ సమస్యలు కూడా తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీడీఏ పీడీ డాక్టర్ బి.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తమ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గిరిజనులకు 728 మందికి 1860 ఎకరాల వ్యవసాయ భూమి, 278 కుటుంబాలకు గృహనిర్మాణాల కోసం 12 ఎకరాల భూమిని చెంచులకు పంపిణీ చేశామని, రైతు భరోసా కింద 1466 మంది చెంచు రైతులకు రూ.6 కోట్లు లబ్ధిపొందారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జబీవుల్లా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, పెద్దకాపు జి.వెంకటరెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, టీడీడబ్ల్యూ జగన్నాథరావు, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మిరెడ్డి, హౌసింగ్ డీఈ ఎస్.సురేష్‌బాబు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై
ఉదారంగా ఉండాలి


- గిరిజనులపై అటవీ శాఖాధికారులు కఠినంగా ఉండటం తగదు
- ఫారెస్ట్ అధికారులకు మంత్రి కనిపించడం లేదా?
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్





చెంచుగూడెంలో ప్రభుత్వ లబ్ధి గురించి వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: అడవులను సంరక్షిస్తున్న గిరిజనులపై అటవీ అధికారులు కఠినంగా ఉండటం తగదని.. వారి సమస్యల పరిష్కారంలో ఉదారంగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గంజివారిపల్లె పంచాయతీ అల్లిపాలెం చెంచుగూడెంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ గూడెం చెంచులు అటవీ శాఖాధికారులపై పలు ఆరోపణలు చేశారు. అడవిలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమానికి ఆ శాఖాధికారులు హాజరుకాకపోవడంతో మంత్రి మండిపడ్డారు. డీఎఫ్‌వో, రేంజర్లకు మంత్రి కనిపించడంలేదని, అల్లిపాలెంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, చెంచులకు ఇంటి పట్టాలు, ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ కార్యక్రమాలకు కూడా వారు హాజరుకాకపోవడం శోచనీయమని అన్నారు. అటవీ ప్రాంతంలో కింద పడుకుంటే విష పురుగులు, పాములు ఎక్కడ కాటేస్తాయోనన్న ఆందోళనతో ఒక వృద్ధురాలు మంచం తయారు చేసుకుంటే ఆ మంచం కోళ్లు కూడా లాక్కెళ్లడం ఏం పద్ధతని ఆయన ప్రశ్నించారు. చెంచులకు కేటాయించిన ఇంటి స్థలాలు మా శాఖకు చెందుతాయని, అక్కడ ఇళ్లు కట్టుకోవటానికి వీలులేదని అటవీ శాఖ, ఆ స్థలాలు మా శాఖకు చెందుతాయని రెవెన్యూ శాఖ అనడం విడ్డూరంగా ఉందని, ఆర్వోఎఫ్‌ఆర్ కింద ఇచ్చిన భూముల్లో వారు ఇళ్లు నిర్మించుకుంటే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. రేషన్ బండి రాకపోవడం వలన 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న గంజివారిపల్లెకు వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నామని, అల్లిపాలెంలో ఉన్నబడి ఎత్తివేయడం వలన తమ పిల్లలు చదువులకు దూరంగా ఉంటున్నారని, అమ్మ ఒడి పథకం వర్తించడంలేదని పలువురు చెంచులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రేషన్ బియ్యం, ఇతర సరుకులు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి ప్రతి రేషన్ కార్డుకు 35 కిలోల బియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌ను ఆదేశించారు. అల్లిపాలెంలో ఉన్న 25 మంది పిల్లలను 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న హనుమంతుని గూడెం హాస్టల్‌లో చేర్పించడం సరైన పద్ధతి కాదని, దీని వలన చిన్నారులు విద్యకు దూరమవుతున్నారని, డ్రాపవుట్లను గుర్తించి వారిని కూడా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన టీడీడబ్ల్యూఓ జగన్నాథరావును ఆదేశించారు. పాఠశాల పక్కా భవనం ఏర్పాటు చేసేవరకు దాతల సహకారంతో తాత్కాలికంగా తరగతి గదులు ఏర్పాటు చేసి అల్లిపాలెంలోనే పాఠశాల నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని, అర్హత ఉన్న ప్రతి తల్లికి అమ్మ ఒడి పథకం వర్తింపచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చెంచు గూడెంలో అనేక మంది రక్త హీనతతో బాధపడుతున్నారని, తక్షణమే వారికి మందులు, టానిక్ అందచేయాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌ను, గూడెంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. గూడెంలోని వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలని, వారికి ఇంకా ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం శాంతి నగర్‌లోని ఆశ్రమ పాఠశాలలో సార్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వంటగది, డైనింగ్ హాల్, బాత్‌రూంలకు మంత్రి శంకుస్థాపన చేశారు.


కార్యక్రమంలో ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, హౌసింగ్ డీఈ ఎస్.సురేష్, డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏవో పి.వెంకటేశ్వర్లు, ఏపీవో నాగేశ్వరరావు, వివిధ శాఖల ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి, అల్లూరయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సర్పంచ్ డి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జబీవుల్లా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, పెద్దకాపు జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.








ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు



మార్గం మధ్యలో మృతిచెందిన యువకుడి మృతదేహం



ప్రమాదానికి గురైన కారు

మృత్యు ఘోష

త్రిపురాంతకం: డ్రైవర్ నిద్రమత్తు నాలుగు నిండు ప్రాణాలను బలితీసుకుంది. జాతీయ రహదారిపై మృత్యు శకటాల్లా దూసుకొచ్చిన కారు, ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొని రహదారి రక్తసిక్తమైంది. ఒక పెళ్లి వేడుకలో మండపం డెకరేషన్ కోసం విజయవాడ నుంచి అనంతపురం వెళ్లిన వారు వేడుక నుంచి తిరిగి కారులో వస్తుండగా త్రిపురాంతకం సమీపంలో ఆదివారం రాత్రి విజయవాడ నుంచి హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సును అదుపు తప్పి ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదానికి గురైన వారంతా 20 నుంచి 30 ఏళ్లలోపు వారే. కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సాయి (26), పిల్లి శ్రీనివాస్ (23), చంద్రశేఖర్ (25), శంకర్ (24), అశోక్, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో సాయి, శ్రీనివాస్, చంద్రశేఖర్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. మార్గంమధ్యలో శంకర్ మృతిచెందగా..అశోక్, రాజు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నిద్రమత్తే ప్రమాదానికి దారితీసింది
కారు నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులోకి జారుకొని ఉంటాడని, త్రిపురాంతకం బైపాస్‌రోడ్డులోని ఫ్లెటైవర్ బ్రిడ్జిపై నుంచి అమిత వేగంగా కిందకి వస్తున్న సమయంలో కారు అదుపు తప్పి అదే వేగంతో విజయవాడ నుంచి హిందూపురం వెళ్తున్న బస్సును ఢీ కొందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


సంఘటన స్థలంలో

మార్కాపురం: ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణంలోని సెవెన్ హిల్స్ వద్ద జరిగింది. ఎస్సై శశి కుమార్ వివరాల ప్రకారం...బోడపాడు గ్రామానికి చెందిన అక్కల అశోక్ (25) పనుల నిమిత్తం మార్కాపురం వచ్చి తిరిగి వెళుతుండగా మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని కింద పడి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రున్ని వెంటనే 108లో జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఒంగోలు టౌన్: ఒంటరిగా నివసిస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన నగరంలోని గానుగపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి భార్య కన్నమంగళం తంజమ్మ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం రాయవెళ్లారుకు చెందిన కన్నమంగళం అన్బు, తంజమ్మ గత 10 సంవత్సరాలుగా ఒంగోలులోని గానుగపాలెంలో నివసిస్తుంటారు. అన్బు బేల్దారి పనులకు వెళ్తుండగా, తంజమ్మ ఇంటి పనులు చేసేది. వీరికి సంతానం లేదు. గత కొద్ది రోజులుగా తంజమ్మ ఆరోగ్యం బాగా లేకపోవడంతో స్వగ్రామం రాయవెళ్లారు వెళ్లి చికిత్స చేయించుకుంటూ అక్కడే ఉంటోంది. అన్బు తరచూ స్వగ్రామం వెళ్లి వస్తూ భార్య బాగోగులు చూసేవాడు. అయితే శనివారం రాత్రి ఒంగోలులోని ఇంట్లో అన్బు అకస్మాత్తుగా మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన సమాచారంతో వెంటనే ఒంగోలుకు వచ్చిన తంజమ్మ తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.







..చిల్

ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతుండటంతో వేసవి తాపానికి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటుండటంతో ఉపశమనం పొందేందుకు తోచిన విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సాయంత్రం ఎప్పుడవుతుందా.. వాతావరణం ఎప్పుడు చల్లబడుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం కొత్తపట్నం సముద్ర తీరంతోపాటు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పర్యాటకులు సేదతీరారు.

- సాక్షి, ఒంగోలు





వలంటీర్ల వ్యవస్థతో మెరుగైన సేవలు


వలంటీర్‌కు సేవా వజ్ర అవార్డు అందజేస్తున్న ఆదిమూలపు సురేష్

- గుడ్ మార్నింగ్ అంటూ పోటీ పడి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ ఫలాలు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: విప్లవాత్మకమైన నిర్ణయాలతో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బొగ్గరపు సత్యమమ్మ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ అని కొనియాడారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే గుడ్ మార్నింగ్ చెబుతూ పోటీ పడి పింఛన్లు అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో అవ్వా తాతలకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ మంజూరయ్యే పరిస్థితి లేదన్నారు. నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలను వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమన్నారు. సచివాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పారదర్శకతతో పాటు జవాబుదారీతనంలో పనిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అందరికీ అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి గ్రామ పరిపాలనలో సమూలంగా విప్లవాత్మక మార్పులు తీసుకుచ్చి దేశంలో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిపాలనను అందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి తోడ్పాడునందించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు ఇంటి వద్దకే అందేలా వలంటీర్లు బాధ్యతగా పనిచేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు గ్రామీణ ప్రజల పాలిట ఆధునిక దేవాలయాలుగా మారాయన్నారు. మానవసేవయే మాధవసేవ అన్న లక్ష్యంతో ఈ ఆధునిక దేవాలయాలు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నాయని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా వలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవావజ్ర బేతం అహరోన్, సేవా రత్న పురస్కారాలను జోగి సాయికృష్ణ, పూర్ణకంటి బాబు, గూండారెడ్డి కాశిరెడ్డి, ముల్లంగి బాలనారాయణమ్మ, యలకపాటి యేహాన్ తదితరులకు ప్రశంసా పత్రం, మెడల్, నగదు ప్రోత్సాహకాలను మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చయ్య యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డుమావత్ లతాబాయి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, సర్పంచ్ చిత్తూరి హారిక, డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా గురవారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

30న ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ ఛాంపియన్‌షిప్

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయిలో ఈ నెల 30న స్థానిక నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఉదయం 10 గంటలకు ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా కార్యదర్శి కమ్మ ఖాదర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైఫిల్, పిస్టల్ పోటీలు విడివిడిగా నిర్వహిస్తామన్నారు. అండర్ 14, 16, 18, 21 అంతకంటే ఎక్కువ (సీనియర్) కేటగిరీలలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ఉత్తీర్ణత పొందిన వారు జూన్ 16 నుంచి హైదరాబాద్‌లోని శాట్స్ షూటింగ్ రేంజిలో జరిగే రాష్ట్ర ఛాంపియన్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9505561357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముండ్లమూరులో చోరీ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరులో రిటైర్డ్ వీఆర్వో చీమలమర్రి లక్ష్మీకాంతారావు సతీమణి హైమావతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. హైమావతి భర్త మృతి చెందడంతో మనవడితో కలిసి ముండ్లమూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సమీపంలో నివాసముంటుంది. తన మనవరాలు నెల్లూరులో ఉండడంతో గురువారం మనవడితో కలిసి వెళుతూ ఇంటిని, కుక్కను చూస్తూ ఉండమని పక్కింటి వాళ్లకు చెప్పి వెళ్లారు. పక్కింటి వారు రోజు గేటు బయట నుంచి కుక్కకు ఆహారం వేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కుక్కకు ఆహారం పెట్టేందుకు రాగా ఇంటి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. దీంతో వారు అద్దంకిలో ఉంటున్న హైమావతి కుమారుడు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. శ్రీనివాసరావు ఇంటికి వచ్చి చూడగా బీరువ పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా..ఎస్సై సంపత్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వివరాలు, వేలిముద్రలు సేకరించారు. ఆరు సవర్ల బంగారం, నగదు కలిపి సుమారు రూ. 4 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హలో.. జాగ్రత్త!

- సెర్చ్ ఇంజన్లలో మోసపూరిత టోల్‌ఫ్రీ నంబర్లు
- అధికారిక సైట్‌లో మాత్రమే కస్టమర్ కేర్ నంబర్ తీసుకోవాలి
- ప్రజలకు ఎస్పీ మలికా గర్గ్ సూచన


ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మోసపూరిత టోల్‌ఫ్రీ నంబర్లతో కస్టమర్ సపోర్ట్ స్కాములపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి సమాచారం కోసమైనా గూగుల్ సెర్చ్ చేస్తున్న ఈ రోజుల్లో మోసగాళ్లు తెలివిగా ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారని తెలిపారు. వివిధ సంస్థలు, బ్యాంకులు, ఆసుపత్రులు, సర్వీస్ సెంటర్ వివరాల కోసమే కాకుండా వివిధ కస్టమర్ కేర్ నంబర్ల కోసం కూడా గూగుల్‌లో సెర్చ్ చేయడం సర్వసాధరణంగా మారిందన్నారు. ఈ క్రమంలో కొందరు కేటుగాళ్లు వివిధ బ్యాంకులు, ప్రముఖ వ్యాపార సంస్థలకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్లను పోలిఉండేలా ఫేక్ వెబ్‌సైట్లను తయారు చేసి నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను సృష్టిస్తున్నారని తెలిపారు. ఏదైనా సమస్యపై కస్టమర్లు ఫోన్ చేసినప్పుడు వారి బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ సేకరించి క్షణాల్లోనే డబ్బు దోచేస్తున్నారని వివరించారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లతో జాగ్రతగా ఉండాలన్నారు.

ఈ జాగ్రతలు పాటించండి

- ఏదైనా అవసరం వచ్చినప్పుడు ఆయా కంపెనీలకు సంబంధించిన యాప్ లేదా అధికారిక సైట్‌లో మాత్రమే కస్టమర్ కేర్ నంబర్ కోసం సెర్చ్ చేయాలి.
- గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్లలో లేదా ట్రూ కాలర్ లాంటి యాప్స్‌లో కస్టమర్ కేర్ సంప్రదింపుల కోసం సెర్చ్ చేయవద్దు.
- కాల్ సెంటర్ నుంచి ఎవరైనా మీ బ్యాంకు ఖాతా వివరాలు, లాగిన్ ఐడీలు, పాస్ వర్డ్‌లు, పిన్, ఓటీపీలు అడిగితే పొరపాటున కూడా ఇవ్వరాదు. బ్యాంకింగ్ సంస్థలు ఎప్పుడూ మీ వివరాలను అడగవు.
- రీఫండ్ వస్తుందని కొన్ని కాల్‌సెంటర్ల నుంచి ఓ లింక్ పంపించి దానిపై క్లిక్ చేసి బ్యాంకు అకౌంట్, ఓటీపీ, పాస్‌వర్డ్ తదితర వివరాలు నమోదు చేయాలని అడిగితే అసలు చేయవద్దు.
- ఈ తరహా సైబర్ నేరం జరిగినట్లు గుర్తించిన వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ట్రాలీ ఆటో బోల్తా


ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై


ప్రమాదంలో గాయపడిన పెద్దన్న

- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు
- పృధులగిరి ఘాట్‌రోడ్‌లో ప్రమాదం


మృతుడు శాసగాని తిరుపతయ్య

మద్దిపూడి: పృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి వెళుతూ ప్రమాదవశాత్తు ట్రాలీ ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం మద్రిపూడి కొండపై ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్రిపూడి గౌడాస్ కాలనీకి చెందిన సుమారు 20 మంది భక్తులు మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం పృధులగిరి కొండకు ట్రాలీ ఆటోలో బయలు దేరారు. టో ఘాట్‌రోడ్ ఎక్కే క్రమంలో రెండవ మలుపు వద్ద అదుపుతప్పింది. వెనక్కి వచ్చిన ఆటోను డ్రైవర్ అదుపు చేయలేక పోయాడు. అయితే డ్రైవర్ చాకచక్యంగా కొండదిప్పకు ఆటో ఆనించడంతో ఘోర ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో ట్రాలీ ఆటో బోల్తా పడి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డారు. ప్రమాదంలో వాహనంలో ముందు కూర్చున్న శాసగాని తిరుపతయ్య(60)కు బాగా ఒత్తుకు పోవడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. అతన్ని బతికించుకునేందుకు బంధువులు విఫలయత్నం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వల్ప గాయాలైన ఆరుగురిని వైద్యశాలకు తరలించారు. ఎస్సై పి.అంకమ్మరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని భార్య కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.